క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత

గోపాలపట్నం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు జేసీఐ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జేసీఐ గ్రీన్ సిటీ సభ్యులు తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. వారిలో ఇంటర్ చదువుతున్న ఎం. ఉపాసన, ఎస్ జ్యోత్స్న, వై. కీర్తన, దివ్య, కె. అమృత, పదోతరగతి చదువుతున్న పి. కోమలి, జి. లేఖ శ్రవంతి, ఎం. భువన ఎంకయ్యారని ప్రకటించారు. ఏడాదికి రూ.3000 వేల చొప్పున అందజేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వై. స్వర్ణలత మాట్లాడుతూ జేసీఐ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలోని ఆదర్శ్ రాయల్ స్కూల్ వద్ద సీసీ రోడ్లు, మెట్లు, డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, తులసి, నందిని పాల్గొన్నారు.


ఉక్కు హెచ్‌ఆర్ అధికారి భానుకు సత్కారం



అవార్డు గ్రహీత భానును సత్కరిస్తున్న హెచ్‌ఆర్ అధికారులు, సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్, ప్లాంట్ పర్సనల్ ఇన్‌చార్జి ఎస్. భానును మంగళవారం హెచ్‌ఆర్ అధికారులు, సిబ్బంది సత్కరించారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె కేంద్ర ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని హెచ్‌ఆర్ కాన్ఫరెన్స్ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ రాధిక మాట్లాడుతూ హెచ్‌ఆర్ అధికారిగా భాను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు లభించడం స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణమన్నారు. సన్మాన గ్రహీత భాను మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు సువేందు కుమార్ ఖర్, వి.ఎల్.పి. లాల్, బి. జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

బనారస్ రైలుకు అంకోరా స్టేషన్‌లో హాల్ట్


తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం (18523/18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11వ తేదీ నుంచి అంకోరా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖపట్నం–బనారస్ (18523) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు ఉదయం 5.08 గంటలకు చేరుకుని 5.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం (18524) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు సాయంత్రం 6.40కి చేరుకుని 6.42కు బయల్దేరుతుంది.

కొండవాలు.. గుండె గుభేలు

- వీధిలైట్లు వెలగక చీకట్లోనే సంచారం
- వర్షం వస్తే నిద్ర కరవు
- ఏ బండ ఇంటి మీద పడుతుందో అని ఆందోళన
- బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న కొండవాలు ప్రాంత ప్రజలు



63వ వార్డు కాకరలోవలో వెలగని వీధిలైటు



రక్షణ గోడలు లేని క్రాంతినగర్ కొండవాలు ప్రాంతం



మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి చింతల్లోవ వెళ్లే దారిలో వీధిలైట్లు లేక చీకటిగా ఉన్న ప్రాంతం

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలోని 63వ వార్డులో అనేక సమస్యలు ప్రజలను నిత్యం వేధిస్తున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు, రక్షణ గోడల వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. కొండవాలు ప్రాంతాలైన కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కు బిక్కుమంటు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ వర్షాకాలంలో బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి ఏ ఇంటి మీద పడతాయో, ఏ గోడ కూలిపోతుందోనని స్థానికులు నిత్యం ఆందోళన చెందుతూ కంటి మీద కునుకు లేకుండా బతుకుతున్నారు. నగరాభివృద్ధి పరంగా ఎన్ని మార్పులు చేస్తున్నా కొండవాలు ప్రాంత ప్రజలు మాత్రం రక్షణ గోడలు, వీధిలైట్లు లేక కొన్నేళ్లుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయినా వారి బతుకులకు మాత్రం భరోసా దక్కలేదు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతుంది తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపించడం లేదు. కొండలపై నిర్మించుకునే ఇళ్లకు ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పించడంలేదు.

వీధి దీపాలు లేక చీకట్లోనే సంచారం..

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుండి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఒక్క క్రాంతినగర్‌లోనే కాకుండా సింధియా నుండి మల్కాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో సైతం వీధిలైట్లు వెలగక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో వీధిలైట్లు వెలగక పోవడంతో రహదారి మొత్తం చీకటిమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు టార్చిలైట్ల వెలుగులో ప్రయాణిస్తున్నారు. రహదారి చీకటిమయం కావడంతో పాదచారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. విష కీటకాలు, పాములు సంచరిస్తాయనే భయంతో పాదచారులు చీకటిని అధిగమించే క్రమంలో పరుగులు తీస్తూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నాయని చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం వచ్చి ప్రజలకు ఏదో చేస్తుందనే ఆశతో ఉన్న ప్రజలకు అడియాశలే మిగిలాయి. ప్రభుత్వం ఏర్పడి నెలలు దాటినా ప్రజా సమస్యలపై మాత్రం స్పందించడంలేదు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాల్సిన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ సమస్యపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రెచ్చిపోతున్న వ్యాపారులు

వార్డులో భవన నిర్మాణ సామగ్రి విక్రయించే వ్యాపారులు కొందరు అధికారుల అండదండలతో రెచ్చిపోతున్నారు. రోడ్డుపై భవన నిర్మాణానికి కావల్సిన ఇసుక, పిక్క, ఇటుక వంటి మెటీరియల్ డంప్ చేసి రోడ్డుపైనే వ్యాపారం సాగిస్తున్నారు. వారిని అడ్డుకోవాల్సిన జీవీఎంసీ అధికారులు వాళ్లకి అండగా నిలుస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ స్టాపర్లను సైతం వారి వ్యాపారాలకు వాడుకుంటున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. యారాడ మలుపు వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. దీంతో కొండ కిందకు దిగే ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



63వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా వేసిన భవన నిర్మాణ సామగ్రి

వానొస్తే కంటి మీద కునుకు ఉండదు



సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వానొచ్చినా, తుపాను హెచ్చరికలు జారీ చేసినా కొండవాలు ప్రాంతాల్లో ఉండే మాలాంటి వారికి మాత్రం కంటి మీద కునుకు ఉండడం లేదు. విషసర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో పాటు బండరాళ్లు దొర్లుతాయేమోనని భయంగా ఉంటోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– పెంటారావు, చింతల్లోవ


వీధి దీపాలు నిత్యం వెలిగేలా చూడాలి



వార్డులో వీధి దీపాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. చీకటిలో ప్రయాణించాలంటే భయంగా ఉంది. పగలంతా ఎలా ఉన్నా చీకటి పడితే మాత్రం బయటికి రావాలంటేనే భయమేస్తోంది. పలు మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం మాత్రం శూన్యం. వీధిదీపాలు నిత్యం వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– అప్పారావు

కుళ్లిన ఉల్లిపాయలే గతి!



రైతుబజారులో ఉల్లిపాయలు



కుళ్లిన ఉల్లిని వేరు చేస్తున్న వ్యాపారస్తుడు

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

గోపాలపట్నం: రైతు బజార్లలో ఉల్లిపాయలు కుళ్లినవి.. నాణ్యత తక్కువ ఉన్నవే దొరుకుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఈ ఉల్లిపాయల వల్ల కిలోకు వంద గ్రాములు దాకా నష్టపోతున్నామని ఆరోపిస్తున్నారు. గతంలో రెండు రకాల ఉల్లిపాయలు దొరికేవని... ఇపుడు కర్నూలు ఉల్లి మత్రమే అమ్ముతుండడంతో గతి లేక కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. అయితే బయట ఉల్లికి.. కర్నూలు ఉల్లికి రూ. 7 మాత్రమే వ్యత్యాసం ఉంటోందని చెబుతున్నారు. ఉల్లి తడిగా ఉండడం, కుళ్లినవి రావడంతో ఈ వ్యత్యాసం సరిపోతుందని లెక్కలు వేస్తున్నారు. నాయకులు, అధికారులు స్పందించి మంచి ఉల్లిపాయలు కూడా రైతుబజార్లలో అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బహిరంగ సభ విజయవంతానికి పిలుపు



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తాము చేస్తున్న పోరాటం ఆగదని సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తు ఈ నెల 11వ తేదీన పాత గాజువాక వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు. 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు అధికారంలో లేక ముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వమని, ప్లాంట్ పరిరక్షణకు పాటుపడతామని ప్రగల్భాలు పలికారన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై నోరు మెదపకపోవటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రధాని మోదీకి భయపడి ప్లాంట్ కార్మికులు రోడ్డున పడుతున్నా మౌనం వహించటం సరి కాదన్నారు. ప్లాంట్ సమస్యపై సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు కార్మికులంతా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గెడ్డల్లోని వ్యర్థాలు సత్వరమే తొలగించండి



ఇసుకతోట గెడ్డను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మద్దిలపాలెం : నగరంలో వర్షాలు కురుస్తున్నందున గెడ్డలు, కాలువల్లోని వ్యర్థాలు పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, సత్వరమే వ్యర్థాలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ 3వ జోన్ 16వ వార్డులోని ఇసుకతోట వద్ద కృష్ణ మందిరాన్ని ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డను పరిశీలించారు. అనంతరం గెడ్డలోని వ్యర్థాలను జెట్ మిషన్, జేసీబీతో తొలగింపజేయించారు. గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడకుండా స్టీల్ మెస్‌ను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ పల్లమ రాజును ఆదేశించారు. ఎక్కడెక్కడ స్టీల్‌మెస్‌లు అవసరమో ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. నిత్యం ప్రధాన రోడ్లను శుభ్రపరచాలన్నారు.

షోకాజ్ నోటీసు జారీకి ఆదేశం

ఇసుకతోట జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన తోపుడు బండి కింద వ్యర్థాలు అధికంగా ఉండడంతో జరిమానా విధించమని వార్డు శానిటరీ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే ఆమె పరిధిలో ఎన్ని వాహనాలున్నాయి..?, ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో వారి హాజరు వివరాలు చూపించమనగా... ఆమె తగిన వివరాలు చూపించకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం అపోలో ఫార్మసీ సమీపంలో గ్రీన్ బెల్ట్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకిని ఆదేశించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ మురళీకృష్ణ, గంగాధర్, సుధాకర్, ఏఎంవోహెచ్ బి.ప్రసాదరావు, సహాయక ఇంజినీరు రహీం పాల్గొన్నారు.

సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించాలి

గేర్ మార్కింగ్ సదస్సులో వక్తలు



సదస్సుకు హాజరైన అధికారులు, మత్స్యకారులు

ఏయూ క్యాంపస్ : కేంద్ర మత్స్య సాంకేతిక పరిశోధన సంస్థ (సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో భారతీయ మత్స్య పరిశ్రమలో గేర్ మార్కింగ్ – అవకాశాలు, సవాళ్ల అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా ఆలోచించేందుకు గేర్ మార్కింగ్ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. గేర్ మార్కింగ్‌పై జాతీయ మార్గదర్శకాలను రూపొందించడానికి మత్స్యకారులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ – సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్ మాట్లాడుతూ గేర్ మార్కింగ్‌పై ప్రపంచ స్థాయిలో జరుగుతున్న విధానాలను వివరించారు. చట్ట విరుద్ధంగా చేపల వేటను తగ్గించడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. గేర్ మార్కింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే రంగుల కోడింగ్ తోపాటు అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ(ఆర్ఎఫ్) ట్యాగ్‌ల వినియోగం, తదితర అంశాలను వివరించారు. డాక్టర్ బి.మధుసూదనరావు మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర కాలుష్యం, చట్ట విరుద్ధమైన చేపల వేటను నియంత్రించడానికి గేర్ ట్రేసబిలిటీని ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంఘం, డాల్ఫిన్ బోట్ ఆపరేటర్లు, వలల తయారీదారులు, చిన్న తరహా మత్స్యకారులు, మత్స్య సంస్థలు, ఎన్‌జీవోలు, ఫిషింగ్ గేర్ తయారీ సంస్థల ప్రతినిధులు స్వయంగా సెషన్‌లో పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు. దేశంలో గేర్ మార్కింగ్ అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించారు.

మానసిక సమస్యలతో వివాహిత ఆత్మహత్య



ప్రత్యూష

కూర్మన్నపాలెం : అశోకనగర్‌లోని ఎస్‌కే రెసిడెన్సీలో నివాసం ఉంటున్న 38 ఏళ్ల వివాహిత పిన్నం రాజు ప్రత్యూష మానసిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె అపార్ట్‌మెంట్ టెర్రస్ పైకి వెళ్లి దూకింది. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ప్రత్యూష తొమ్మిదేళ్లగా మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఆమె భర్త పి.అనేష్ అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో పని చేస్తున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. తమ కుమారుడి చదువు కోసం ఇటీవలే రాంబిల్లి నుంచి అశోక్‌నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి వివాహమై 16 ఏళ్లు అయిందని పోలీసులు తెలిపారు. సంఘటనపై ప్రత్యూష తండ్రి, రిటైర్డ్ ఉక్కు ఉద్యోగి పాకలపాటి సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమార్తె మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సినర్జీస్ కార్మికులది ఆకలి పోరాటం



సినర్జీస్ కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న ఏఐటీయూసీ నేత వెంకటరావు

అగనంపూడి: సినర్జీస్ కార్మికులు చేసేది సమ్మె కాదని, ఆకలి పోరాటమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బూసి వెంకటరావు అన్నారు. ఐదు రోజులుగా దువ్వాడలో సినర్జీస్ కార్మికులు కొనసాగిస్తున్న ఆందోళన కార్యక్రమానికి మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఆరు మాసాలు జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను పస్తులకు గురిచేస్తున్న యాజమాన్యం తీరు సరికాదన్నారు. కంపెనీ చట్టం 447 ప్రకారం జీతాలు చెల్లించకపోవడం ఆర్థిక మోసం, దగాగా భావించి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆకలి కేకలు కూటమి ప్రభుత్వ పెద్దలకు వినపడడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను కోత విధిస్తున్నా ఆయా ఖాతాలకు జమచేయకుండా మింగేయడం వల్ల కార్మికులు తీరని నష్టానికి గురవుతున్నారన్నారు. బకాయి వేతనం వెంటనే చెల్లించాలని, యాజమాన్యం దిగిరాకపోతే న్యాయపోరాటం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికుల ప్రతినిధులు ఎ.దాస్, బి.రమణ, ఉదయ్‌కుమార్, బషీర్, పి.ఆనంద్, ఎం.శ్రీనివాస్, సుదర్శనరావు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ అందించాలి

మద్దిలపాలెం : గిరిజన యువతను సాధికారత దిశగా నడిపించే విధంగా నైపుణ్య శిక్షణ అందించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ యువతలో నైపుణ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. సోషల్ ఇంక్లూషన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ శంకువానిపాలెంలో ఇటీవల సర్వే నిర్వహించామని, అక్కడి యువతకు ఉపాధికి దోహదపడే నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ భాగస్వామ్యంతో వీరికి నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

ఉక్కు డీఏవీ విద్యార్థులకు పతకాల పంట



విజేతలను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని డీఏవీ పాఠశాల విద్యార్థులు అంతర పాఠశాలల జోనల్ క్రీడా పోటీల్లో 44 బంగారు పతకాలు, 60 కాంస్య పతకాలు, 3 రజత పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సుగుంధ కుమారి తెలిపారు. సోమవారం విజేతలను అభినందించి సాధించిన పతకాల వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 8వ వరకు రాజాంలోని జీఎంఆర్ డీఏవీ పాఠశాలలో జరిగిన జోనల్ క్రీడా పోటీల్లో ఉక్కు డీఏవీ పాఠశాలకు చెందిన 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర అండర్–17 విభాగంలో వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం గెలుపొందారు. అదే విధంగా బాలికల అండర్–17 పోటీల్లో వాలీబాల్, యోగా పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. బాలికల అండర్–14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌లో అండర్–17 బాలుర విభాగంలో 100 మీ, 200 మీ పరుగు పందెం పోటీల్లో మాస్టర్ షణ్ముఖ శివాజి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్ బాలికల అండర్–14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో చాందిని మొదటి స్థానం, అలాగే రిలేపరుగులో హైమ తేజశ్వి జట్టు మొదటి స్థానం సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో గిరీశ్వరరెడ్డి రజత పతకాన్ని గెలుపొందాడు. కార్యక్రమంలో మేనేజర్ వి. శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఐ రమేష్, తదితరులు

ఎంవీపీ కాలనీ : తీరప్రాంత భద్రతపై కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా మత్స్యకారులకు మంగళవారం అవగాహన కల్పించారు. జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత సామగ్రి, మన జిల్లాకు సంబంధం లేని ఇతర బోట్లు తీరంలో కనిపిస్తే తక్షణమే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కొన్ని సందర్భాల్లో అనుమానాస్పదంగా దొరికే పరికరాలను, బాక్స్‌లను తెరిస్తే ప్రమాదాలకు గురవుతారన్నారు. వాటిని నేవీ కోస్టుగార్డ్స్‌కు అప్పగించాలని సూచించారు. తీరప్రాంత భద్రత అందరి బాధ్యత అనే విషయాన్ని మత్స్యకారులు గమనించాలన్నారు. ఇందుకు అనుగుణంగా పోలీసులకు, ప్రభుత్వానికి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి చిట్టిబాబు, గ్రామ పెద్దలు పరసన్న, తెడ్డు రాజు, తెడ్డు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ద్రోహం



ఇసుకతోటలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మద్దిలపాలెం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) పిలుపు మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇసుకతోట పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి ఇసుకతోట పోస్టాఫీసుకు వెళ్లి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు సమస్యల పరిష్కారానికి స్పందించాలని కోరుతూ పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల జీవన పరిస్థితులు మారలేదన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. సంక్షేమ బోర్డులో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాల కోసం నిధులు ఖర్చు చేయకుండా కాలయాపన చేయడం కార్మిక ద్రోహమే అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇసుకతోట భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు బి.ప్రతాప్, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.